విశాలాంధ్ర విశాఖపట్నం
పేజి నెం. 5
బుధవారం 13, నవంబర్, 2024



బోర్ వెల్స్ ప్రారంభించిన స్టాలిన్

విశాలాంధ్ర - గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ పరిధి 72వ వార్డు పరిధిలోని ఓల్డ్ కర్ణవాని పాలెం, శ్రీనగర్‌లలో నూతన బోర్ వెల్స్‌ను వార్డు కార్పొరేటర్ ఏ.జె.స్టాలిన్ మంగళ వారం బీజేపీ, జనసేన నేతలతో కలిసి ప్రారంభించారు. అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ నీటి సమస్య పరిష్కారానికి బోర్ వెల్స్‌ను ప్రారంభించామని అన్నారు. వార్డు పరిధిలో మౌలిక సౌకర్యాల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని అన్నారు. ఇప్పటికే వార్డు పరిధిలో రోడ్లు, డ్రైనేజి పనులను పూర్తి చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.జె.పి నాయకులు కరణం రెడ్డి నర్సింగరావు, జనసేన నాయకులు కరణం కనకారావు, సిరసపల్లి అప్పారావు, గొంతిన దేముడు, పెతకం శెట్టి జగన్, బోర్ వెల్స్ సూపర్ వైజర్ రామ కృష్ణ పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నిక పారదర్శకంగా నిర్వహించాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: నీటి సంఘాల ఎన్నిక ప్రక్రియపై అధికారులందరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రతువును అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 23న జరగబోయే నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే ఈవో, ఏఈవో, పీవో, ఏపీవోలకు కలెక్టరేట్ మీటింగు హాలులో మంగళవారం ఒక్క రోజు శిక్షణ సదస్సు ఏర్పాటు చేశారు. మాస్టర్ ట్రైనర్లు వి. చిన్నంనాయుడు, ఆర్. సురేశ్ కుమార్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. గత అనుభవాలు, ఇప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. సాంకేతికపరమైన అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తూ శిక్షణ అందజేశారు. అధికారులు, సిబ్బంది అడిగి సందేహాలను నివృత్తి చేశారు. శిక్షణ సదస్సులో భాగంగా జిల్లా కలెక్టర్ పలు అంశాలపై సూచనలు చేశారు. రైతులకు అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని, వారి సందేహాలను నివృత్తి చేయాలని చెప్పారు. గ్రామీణ మండాలలైన భీమిలి, ఆనందరపురం, పెందుర్తి, పద్మనాభం మండలాల పరిధిలో మొత్తం 29 నీటి సంఘాలకు ఈ నెల 23వ తేదీన ఎన్నిక ప్రక్రియ జరుగుతుంది కాబట్టి అందరూ సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉంటూ పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. నోడల్ అధికారి జె. స్వామినాయుడు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. ఏయే స్థాయిలో అధికారి ఏం చేయాలని, వారి విధి నిర్వహణకు సంబంధించిన అంశాల గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, నీటి పారుదల శాఖ అధికారులు, తహశీల్దార్లు, ఈవోలు, ఏఈవోలు, పీవోలు, ఏపీవోలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఐఆర్ఎస్ ప్రిన్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని మంగళవారం సెంట్రల్ ఇన్‌కమ్ టాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ డా రాజేంద్రకుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రోటోకాల్ ప్రకారం ఏఈఓ వి.రాంబాబు సాదర స్వాగతం పలికారు. తరువాత ధ్వజస్తంభం వద్ద ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారి ఎన్.ఆనంద్ కుమార్ స్వాగతం పలికి ముందుగా కప్పస్తంభం ఆలింగనం తదుపరి బేడా మండపం ప్రదక్షణ చేశారు. ఏఈఓ ఆనంద్ కుమార్ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి ప్రసాదాలని చిత్రపటాన్ని అందజేశారు. వీరితో ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు, పీఆర్ఓ నాయుడు తదితరులు ఉన్నారు.

ఆచార్య జాలాది రవిపై విచారణ కమిటీ

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవిపై వచ్చిన ఫిర్యాదు మేరకు జాతీయ ఎస్సీ కమిషన్ సూచనతో వాస్తవాలు తెలుసుకునేందుకు గాను ఏయూ ఉన్నతాధికారులు ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. కామర్స్ అండ్ మేనేజిమెంట్ విభాగంలో ఎంఫిల్ పూర్తి చేసుకొని పిహెచ్‌డి కన్వర్షన్ కొరకు క్షీర సాగర్ గోగులమూడి అనే స్కాలర్ డిసెంబర్ 2022లో దరఖాస్తు చేసుకోగా ఆ విభాగ అధిపతి అయిన ఆచార్య జాలది రవి స్కాలర్‌పై దురుద్దేశంతో ప్రవేశం కల్పించలేదని, ఎందువలన ప్రవేశం ఇవ్వలేదు అని ప్రశ్నించిన తనపై ప్రొఫెసర్ జాలాది రవి అసభ్య పదజాలంతో దూషించారని, దీనితో మానసిక వేదనకు గురైన తాను ఆరోగ్యం క్షీణించి తద్వార గుండె సంబంధిత సమస్య తో హాస్పిటల్ లో జాయిన్ అయ్యానని ఎస్సీ కమిషన్‌కి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన కమిషన్ విచారణ కోరుతూ విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులకు నోటీసు పంపింది. స్పందించిన వర్సిటీ ఉన్నతాధికారులు అక్టోబర్ నెల చివరి వారంలో వర్సిటీలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతా మాణిక్యం, అకాడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, ఐఏఎస్ఈ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డి.నాగరాజ కుమారి ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు.

ఉక్కు శివాలయం దర్శనానికి అనుమతి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: కార్తీక మాసంలో వచ్చే పవిత్రమైన 3, 4 సోమవారాల్లో బయట నుండి వచ్చే భక్తులకు ఉక్కు యాజమాన్యం అనుమతినిచ్చింది. ఈ సందర్భంగా ఉక్కు అధికారులు మాట్లాడుతూ శివాలయం దర్శనకి వచ్చే వారు ఆధార్ కార్డు ఖచ్చితంగా చేత పట్టుకు రావాలన్నారు. 14 సంవత్సరాలు లోపు పిల్లలకు ప్లాంట్‌లోకి ప్రవేశం లేదన్నారు. భక్తులు శివాలయ దర్శనం చేసుకొని నేరుగా వెనక్కి వెళ్లాలని ప్లాంట్‌లో గల ఇతర విభాగాల సందర్శనకు అనుమతి లేదన్నారు. అనుమతి ఇచ్చినందుకు ఆలయ కమిటీ సభ్యులు భద్రు నాయక్, యేల్లేటి శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాస్, కనకరెడ్డి, సురేంద్ర ధన్యవాదములు తెలిపారు.

డిసెంబర్ 8న ఆత్మీయ వన సమ్మేళనం

విశాలాంధ్ర - గాజువాక: తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉక్కు నగరంలోని నెహ్రూ పార్కులో డిసెంబర్ 8న ఆత్మీయ వనసమ్మేళనం నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కుమార స్వామి, జి.ఆనంద్ తెలిపారు. సంఘం కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా తమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తు న్నామని అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 8న ఉక్కు నగరంలో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో సంఘం ముఖ్య సలహాదారు ఎన్.వీరేశం, ప్రతినిధులు ఎంకెవిఆర్ మోహన్‌రావు, బి.వెంకటేశ్వర్లు, ఎం.వేణు గోపాల్, ఎన్.నర్సింగరావు, టి.ప్రభాకర్, సి.హెచ్ .రవి కుమార్, జి.మల్లేశం, భిక్షం, పరమేష్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో నగరంలో గంజాయి, ఇతర నార్కోటిక్ డ్రగ్ కట్టడిలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, బీచ్ రోడ్ తదితర ప్రాంతాల్లో నాల్గవ పట్టణ పోలీసులు, సిటీ టాస్క్ ఫోర్స్, నార్కోటిక్ డిటెక్షన్ చేసే స్నిపర్ డాగ్‌తో కలసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ ప్రథమ ప్రవేశ ద్వారం-01 వద్ద అక్రమంగా తరలిస్తున్న 30 కేజీల గంజాయిని గుర్తించి జి.ఆర్.పి పోలీసులకు అప్పగించారు. గంజాయి పట్టుకోవడంలో ప్రతిభ చూపిన స్నిపర్ డాగ్‌ను, డాగ్ హాండ్లర్‌ను, నాల్గవ పట్టణ పోలీసులను సిపి అభినందించారు.

సీఐటీయూ కార్యకర్త మృతి

విశాలాంధ్ర - తగరపువలస: చిట్టివలస జూట్ మిల్ కార్మికుడు, సీఐటీయూ సీనియర్ కార్యకర్త సంతపేటకి చెందిన బాకీ రాజు బాబు అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకి సీఐటీయూ జోన్ కమిటీ తరఫున శ్రద్ధాంజలి ప్రకటించారు. రాజబాబు కార్మికుల తరఫున అనేక పోరాటాలు ఉద్యమాల్లో పాల్గొన్నారని ఆయన మృతి తీరని లోటని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆర్చరీ పోటీలు

విశాలాంధ్ర - సాగర్‌నగర్: ఎనిమిదవ వార్డు పరిధిలో రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. రాణి మంద పర్యవేక్షణలో మంగళవారం గాయత్రి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో పాడేరు, పార్వతీపురం, రంపచోడ వరం, కోటరామచంద్రాపురం, సీతంపేట, చిత్తూరు. నెల్లూరు. శ్రీశైలం ప్రాంతాల ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీస్ (ఐటిడిఏ) నుండి 34 మంది పాల్గొన్నారు. ఈ పోటీల్లో దేశయ్య. కె.కృష్ణ, సి.హెచ్. బాలకృష్ణ, చంచయ్య నలుగురు ఈ నెల 30వ తేదీన కేరళలో వైనాడులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం మండల పరిషత్ కార్యాలయ మందిరంలో స్థానిక ఎంపీపీ రాంబాబు అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ కూడా పంచాయతీ ప్రస్తుత అవసరాలు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి పంచాయతీలో కూడా అభివృద్ధి ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. పారిశుద్ధ్యం, త్రాగు నీరు, వ్యవసాయం, విద్య, వైద్యం, తడి చెత్త పొడి చెత్త వేరు చేయుట నిర్వహణ, మరుగునీటి కాలువలు సిసి రోడ్ల నిర్మాణం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, శిక్షణకు హాజరైన సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా 26న ప్రదర్శన, సభ

జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు

విశాలాంధ్ర - విశాఖ: కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోనికి వచ్చిన తరువాత కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేయడంలో దూకుడు పెంచిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.అచ్యుతరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబరు 26వ తేదీన దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో విశాఖలో అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం సిఎఫ్‌టియుఐ నాయకులు కనకరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం తన విధానాల్లో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీరం చేసే విధంగా కుట్రలు పన్నుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ముడిసరుకును నిలిపివేయడం, బ్లాస్ట్ ఫర్నేస్ మూసివేయడం, కార్మికులకు జీతభత్యాలు సకాలంలో చెల్లించకపోవడం, రాయితీలను తొలగించడం, విఆర్ఎస్ పేరుతో 2,500 మంది కార్మికులను కుదించడం, 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుండి తొలగించడం వంటి చర్యలకు పూనుకుం టుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుం టామని తెలిపారు. కార్మికులకు నష్టం చేస్తున్న 4 లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు తక్కువ లేకుండా చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, వివిధ ప్రభుత్వ స్కీమ్స్‌లో పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, విఓఎ, ఆర్.పి.లు, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ఆటో, ముఠా, భవన నిర్మాణం, తోపుడు బండ్లు, రవాణా రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఈపిఎస్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, అధిక ధరలు నియంత్రించాలని, విద్యుత్ నియంత్రణ చట్టం రద్దు చేయాలని తదితర డిమాండ్‌లతో ప్రదర్శన, సభ జరుగుతుందన్నారు. నవంబరు 26కు ప్రత్యేకత ఉందని, ఆరోజు భారత రాజ్యాంగ పరిరక్షణా దినమని, రైతులు కనీస మద్దతు ధర కోసం, నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో పోరాటం ప్రారంభించిన రోజన్నారు. ఆ పోరాట స్ఫూర్తితో జరుగుతున్న నిరసన ప్రదర్శన, సభల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొవాలని కోరారు. ప్రదర్శన ఉదయం 10గంటలకు దొండపర్తి రైల్వే డిఆర్ఎం ఆఫీస్ నుండి ప్రారంభమై జివిఎంసి గాంధీ విగ్రహం వరకు సాగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కె.శంకరావు, ఐఎఫ్‌టియు నాయకులు తిరుపతిరావు, ఎపిఎఫ్‌టియు నాయకులు దేవా, సిఐటియు జిల్లా కార్యదర్శులు బి.జగన్, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక యోధుడు గుజ్జు రామనాయుడు

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ

విశాలాంధ్ర - విశాఖ: కార్మిక హక్కుల కోసం కామ్రేడ్ గుజ్జు రామనాయుడు అనేక పోరాటాలు చేశారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ కొనియాడారు. ఆయన 40వ వర్ధంతి కార్యక్రమం గుడివాడ గ్రామంలో మంగళవారం కొండపు ఈశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుజ్జు రామనాయుడు చిట్టివలస లేబర్ యూనియన్ కార్యదర్శిగా కార్మికుల హక్కులు కాపాడడం కృషి చేసారని అన్నారు. చంద్రయ్య మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో అనేక పోరాటాలు చేసి కార్మిక హక్కుల కోసం జైలుకెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయని అన్నారు. కడలూరు జైలుకెళ్లారని తెలిపారు. కానూరు రాంబాబు మాట్లాడుతూ 1979 స్ట్రైక్‌లో చిట్టివలస జూట్ మిల్లు కార్మికుల్ని గుజ్జు రామనాయుడు ముందుండి నడిపించి కార్మికులు హక్కులు నష్టపోకుండా చూసారన్నారు. ఈ కార్యక్రమంలో కొండపు ఈశ్వరరావు మాట్లాడుతూ గుజ్జు రాము నాయుడు అంటే గుడివాడ అని, గుడివాడ అంటే గుజ్జు రామునాయుడు అని అన్నారు. కార్మికులందరూ జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో చిల్ల రామ్ పైడి, అప్పలరాజు, లక్ష్మణరావు, సన్ని బాబు, ముత్యాలు, నువ్వుల ఆదినారాయణ, గోవింద పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - ఆనందపురం: నవంబర్ 14 బాలల దినోత్సవం పురస్కరిం చుకొని 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్నట్లు లైబ్రేరియన్ బి.వి.ఎస్.అప్పారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 14వ తేదీ గురువారం నుంచి జాతీయ గ్రంథాలయ వార్షికోత్సవంలో జాతీయ పతకా ఆవిష్కరణ, జవహర్ లాల్ నెహ్రూ జయంతి (బాలల దినోత్సవం) 15వ తేదీన పుస్తకప్రదర్శన, హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 16వ తేదీన కవి సమ్మేళనం, హైస్కూల్ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, 17వ తేదీన గ్రంథాలయ రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖులను స్మరించుకొనుట, 18వ తేదీన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, కథలు చెప్పడం, కథలు రాయడం, మ్యూజికల్ చైర్స్ పోటీలు, 19వ తేదీన భారతదేశతొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం, 20వ తేదీన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ, మాస్ రీడింగ్, బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఏఐటీయూసీ నేత వామనమూర్తి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం జీవీఎంసీ ఎదురుగా ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పాల్గొని మాట్లాడుతూ ఆటో డ్రైవర్‌కు పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ప్రభుత్వం చేయాలని, ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఆటో డ్రైవర్‌లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 16న విజయవాడలో జరిగే ఆటో డ్రైవర్ మహా ధర్నాలో పాల్గొని ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలని ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, విద్యుత్ చార్జీలు, బియ్యం, పప్పులు, వంటనూనె ధరలు తగ్గించే ఆటో డ్రైవర్‌లకు జీవనోపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 21, 31 రద్దు చేయాలని, ఆటో డ్రైవర్ వాహన మిత్ర వెంటనే అమలు చేయాలని, డ్రైవర్ల మీద ఉన్న పోలీస్ ఆర్టీవో ఈ చలనాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో స్టాండ్ అధ్యక్షులు వై.వెంకట్, హెచ్.శేఖర్, ఎంఏ ఖాన్, కేలం శివ, ఎం.మధు రెడ్డి, రావికృష్ణ, ఎస్.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శుద్ధ ఏకాదశి

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి కృష్ణా కాలనీ కొండపై వున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం స్వామి వారికి చందన అలంకరణ సేవ ఆలయ అర్చకులు జివి అప్పలచార్యులు వారి పర్యవేక్షణలో జరిగింది. ఈ చందన అలంకరణ సేవ రెండు రోజులపాటు ఉంటుంది. కావున భక్తులు అందరూ స్వామి వారిని చందన అలంకరణలో దర్శించికొని, స్వామి వారి కృపకుపాత్రులు కావాలని ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షులు గాడు అప్పల నాయుడుకోరారు. ఈ కార్యక్రమంలో చంద్రమూర్తి, ముమ్మిడి శెట్టి సత్యానందరావు, కంటుభుక్త ముత్యాలరావు, రేలంగి పెదబాబు, కనకల సన్నిబాబు, గాడు ఆనంద్, బొండా బాలాజీ, మొకర శంకర్ పాల్గొన్నారు.

మతాన్ని శాస్త్రీయ దృక్పథంతో అవగాహన చేసుకోవాలి

గీతం బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ఆర్.కె.మిషన్ స్వామీజి

విశాలాంధ్ర - మధురవాడ: మతం అంటే పూజలు, ఆచారాలు, మూఢనమ్మకాలు కాదని సనాతన ధర్మం అని మతాన్ని శాస్త్రీయ దృక్పథంతో అవగాహన చేసుకోవాలని రామకృష్ణ మిషన్ స్వామీజి విద్యానంద పేర్కొన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ సమితి (జెఎన్‌వి) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ - 2024లో మంగళవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. స్వామీజి తన ప్రసంగంలో విజ్ఞానం (సైన్స్), ధర్మం (రెలిజియన్) మధ్య సంబంధాన్ని వివరిస్తూ ధర్మం అంటే సమాజంలో విలువలు, శాంతి, నైతిక ప్రవర్తన అని తెలిపారు. విజ్ఞాన శాస్త్రం ప్రస్తుతం వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలను ఆపలేదని అయితే సనాతన ధర్మానికి సమాజంలో శాంతిని నెలకొల్పే శక్తి ఉందన్నారు. ధర్మం మనిషి మనసులో సత్యం, అహింశ, ఇతరుల పట్ల ప్రేమ, ఉత్తమ మానవ సంబంధాలను నెలకొల్ప గలదన్నారు. శాస్త్ర విజ్ఞానాన్ని సమాజ ప్రగతికి ఉపయోగిస్తూనే ధర్మాన్ని కూడా సమానంగా గౌరవించా లన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రముఖ భూభౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ మాట్లాడుతూ సముద్ర శాస్త్ర విజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోందని ముఖ్యంగా 2025 నుంచి ప్రారంభం కానున్న భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక సముద్రయాన్ ప్రాజెక్టు దేశానికి విలువైన వనరులను అందించగలదని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషియానోగ్రఫి (ఎన్ఐఓ) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వివిఎస్ఎస్.శర్మ, సముద్ర పరిశోధనలలో సవాళ్ళు మరియు అవకాశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమీషనర్ డాక్టర్ ఇ.ఉమాపతి రెడ్డి, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, జవహర్ నవోదయ విద్యాలయ సమితి విశాఖ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు జరిగే బాలల సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా విజ్ఞాన శాస్త్ర విశేషాలపై ప్రముఖల ప్రసంగాలను ఏర్పాటు చేశారు.

రెల్లి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన రెల్లి కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పెల్లి కులాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఇసుకపల్లి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వి జె ఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ చైర్మన్ పదవిని నిరంతరం రెల్లికుల సంక్షేమం, టీడీపీ పార్టీ గెలుపు కోసం పనిచేసిన రెల్లి కుల సంఘం ఉపాధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పొడుగు కుమార్‌కి కేటాయించాలని ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కోరారు. మారుమూల గ్రామాల్లోని రెల్లి ప్రజలు 19 లక్షల మంది వున్నారని, చదువు, ఉద్యోగాలు, రాజకీయాల్లో అత్యంత వెనుకబడి వున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణలో రెల్లి, రేల్లి ఉప కులాలకు ఐదు శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఆయన కోరారు. ఆంధ్ర ప్రదేశ్ మానవ హక్కుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మ కాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం రెల్లి నాయకులను ప్రోత్సహించాలని కోరారు. మాల, మాదిగ కార్పొరేషన్ లు మాదిరిగానే, రెల్లి కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.పొడుగు కుమార్ సహా, ఉత్తరాంధ్ర లో గల రెల్లి నాయకులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కోరారు. దళిత సంఘం నాయకుడు కస్తూరి వెంకటరావు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం కూడా రెల్లి కులాలకు న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మమ్మల్ని ఎందుకు అనగదొక్కుతున్నారని ప్రశ్నించారు. సంఘం నాయకుడు సురేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందించి రెల్లి నాయకులకు న్యాయం చేయాలన్నారు. ఈ విషయంలో సీఎం, పవన్ కళ్యాణ్ కూడా స్పందించాలని కోరారు. ఉప కులాలకు కూడా న్యాయం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో సంఘం నాయకులు సత్యం, బంగారు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 1 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై జరిమానాలు

నగరంలో ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణకు 45 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు – విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖ నగరంలో 2025 జనవరి ఒకటి నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిర్మూలించడం జరుగుతుందని, అతిక్రమించి వినియోగించిన, విక్రయించిన వారిపై జరీమానలు విధించబడతాయని, ఆ దిశగా నేటి నుండి 45 రోజులపాటు ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణపై ప్రజలకు ఎస్.హెచ్.జి. మహిళల భాగస్వామ్యంతో విరివిగా నిత్యం అవగాహన కార్యక్రమాలు నగరంలో నిర్వహించబడునని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. మంగళవారం విఎంఆర్డిఏ వుడా చిల్డ్రన్ ఏరీనాలో నగరంలో పారిశుద్ధ్య మెరుగుదలపై, ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణ పై ఆర్పీలు, శానిటేషన్ కార్యదర్శులకు జీవీఎంసీ నిర్వహించిన వర్క్ షాప్ నందు జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా జీవీఎంసీ నిర్వహించిన వర్క్ షాప్ నందు నగరంలో పారిశుద్ధ్యం మెరుగుదల, పనితీరు, విధి విధానాలపై రూపొందించిన వీడియోను, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తిలకించిన కలెక్టర్ మాట్లాడుతూ విశాఖపట్నం రాష్ట్రానికి తలమానికమని, దేశంలోనే నాలుగవ పరిశుభ్ర నగరంగా విశాఖ గుర్తింపు పొందినదని, సాక్షాత్తు భారత ప్రధాని ప్రశంసలను విశాఖ నగరం పొందడం విశాఖ నగర ప్రజలకు మరింత ఉత్తేజాన్ని కలిగించిందని గుర్తు చేశారు. విశాఖ నగరంలో గల మారుమూల ప్రాంతాల్లో కూడా శత శాతం పరిశుభ్రతను కలిగి ఉండేలా ప్రణాళికలను జీవీఎంసీ చేపట్టిందని, ఆ దిశగా విశాఖ నగరం నుండి ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎస్.హెచ్.జి. మహిళలు, శానిటేషన్ కార్యదర్శుల భాగస్వామ్యంతో 45 రోజులపాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తిదారులు, వినియోగదారులు, విక్రయ దారులు ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలికి, నగరంలో విరివిగా లభిస్తున్న ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ఈ విషయమై జోనల్ కమిషనర్లు ప్రత్యేక బాధ్యతలు చేపట్టాలన్నారు. నగరంలో గల ఆర్పీలు ఒక మాస్టర్ ట్రైనర్లు గా మిగిలిన ఆర్పీలకు, మహిళలకు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 45 రోజులు పాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన సింగల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను తప్పకుండా నిర్మూలిస్తూ, అతిక్రమించిన వారిపై జరిమానాలు కూడా విధించబడతాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం జివిఎంసి కమిషనర్ తో కలిసి "సే నో టు ప్లాస్టిక్" బ్రోచర్ను విడుదల చేసి, విశాఖ నగరాన్ని దేశంలోనే పరిశుభ్ర నగరంగా ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ ముఖ్యంగా ఆర్పిలకు అవగాహన కల్పించారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ నగరంలో జీరో ప్లాస్టిక్, జీరో గార్బేజ్ దిశగా జీవీఎంసీ కార్యాచరణ రూపొందించిందని, ఆ దిశగా నగరంలో గల అన్ని వార్డుల నందు అన్ని ప్రాంతాలలో శత శాతం పారిశుధ్యం మెరుగుదలకు, సింగల్ యూస్ ప్లాస్టిక్ నిర్మూలనకు జీవీఎంసీ యంత్రాంగం, వార్డు శానిటేషన్ కార్యదర్శులు, ఎస్.హెచ్.జి. మహిళలు, ఆర్పీలు ప్రత్యేక అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విశాఖ నగరం దేశంలోనే పరిశుభ్రనగరంగా గుర్తింపు పొందుతుందని ఆ దిశగా మరింత పరిశుభ్రతతో విశాఖ నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలన్నారని కమిషనర్ తెలిపారు. అందుకే విశాఖ నగర ప్రజలను విషపూరితంగా భయభ్రాంతులకు గురి చేస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను ఈ నగరం నుండి తరిమి కొట్టాలని, ప్రజలకు, ప్లాస్టిక్ వినియోగదారులకు, ఉత్పత్తిదారులకు, విక్రయదారులకు 45 రోజులపాటు ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. 120 మైక్రాన్ల మందం కంటే తక్కువ ఉన్న సింగల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధాన్ని తూచా తప్పకుండా అమలు చేయడం జరుగుతుందని, ఈ అవగాహన కార్యక్రమాలు అనంతరం అతిక్రమించిన వారిపై జనవరి ఒకటి నుండి చట్టపరమైన చర్యలను చేపట్టడం, జరిమానాలను విధించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఆ దిశగా ఎన్ఫోర్స్మెంట్ బృందాలను జీవీఎంసీ త్వరలోనే చట్టపరమైన విధివిధానాల రూపకల్పనతో ప్రవేశపెడుతుందన్నారు. పారిశుధ్య నిర్వహణపై జీవీఎంసీకి ఉన్న యంత్రాలను, వాహనాలను వినియోగిస్తూ పారిశుధ్య నిర్వహణకు అధికారులు, సానిటరీ ఇన్స్పెక్టర్లు,వార్డు శానిటేషన్ కార్యదర్శులు, ఎస్హెచ్ జి మహిళ లు, ఆర్పీల, భాగస్వామ్యంతో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు 45 రోజులు పాటు విరివిగా చేపట్టాలని కమిషనర్ తెలిపారు. 2022లో ప్లాస్టిక్ నిర్మూలన పై జీవీఎంసీ చేపట్టిన అవగాహనలో ఎదుర్కొన్న అంశాలపై చర్చ జరిపారు. అనంతరం వర్క్ షాప్ నందు హాజరైన పలువురు ఆర్పీలు, ఎస్.హెచ్.జి మహిళలు, వార్డు కార్యదర్శులతో ప్లాస్టిక్ నియంత్రణపై సందేహాల నివృత్తి పై కలెక్టర్ తో కలిసి చర్చ జరిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్ సోమన్నారాయణ , ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ 45 రోజులు పాటు "సే నోటు ప్లాస్టిక్" నినాదంతో జీరో గార్బేజ్ - జీరో ప్లాస్టిక్ పై ప్రజలందరూ సహకరించేలా అవగాహన కార్యక్ర మాలు విరివిగా చేపట్టి విశాఖ నగర అభివృద్ధికి సహకరించాలని ఆర్పీలకు, వార్డు శానిటేషన్ కార్యదర్శులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, యు.సి.డి. ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఎం.సత్యవేణి, అందరు జోనర్ కమిషనర్లు, సహాయ వైద్యాధికారులు, ఏపీడీలు, డిపిఓలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

విశాలాంధ్ర - గాజువాక: వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ పరిధిలోని 6వ జోన్ 88వ వార్డు పరిధిలో దువ్వాడ, ఉప్పర కాలనీ, ఇందిరానగర్, కొత్తూరు, నంగినారపాడు, గంగవరం, సత్తివానిపాలెం, వెదురల్ల నరవ, నరవ తదితర ప్రాంతాలలో ఆ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డ్ కార్పొరేటర్ స్థానిక సమస్యలను కమిషనర్ కు వివరించగా, కమిషనర్ స్పందిస్తూ దువ్వాడ సెక్టార్లో రోడ్డు విస్తరణ, కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తూ, యాజమాన్యానికి వారి రక్షణ గోడ మార్పు చేయుట కొరకు ఒక లేఖను తయారు చేయాలని ఎసిపి వెంకట్రావును ఆదేశించారు. ఉప్పర కాలనీ రహదారి మరమ్మత్తులు, ఇందిరానగర్ కాలనీ వాసులకు ఇబ్బంది లేకుండా సిసి రోడ్డు, బిటి రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కొత్తూరు రోడ్డు విస్తరణ చేస్తూ తారు రోడ్డు ఏర్పాటుకు, రోడ్డు పక్కన నీరు నిల్వ వున్న ప్రాంతంలో కాలువ నిర్మాణానికి వెదురల్ల నరవ నుండి చైల్డ్ ఫైత్ మిషన్ (మెట్ట) వరకు రోడ్డు వెడల్పు తారు రోడ్డు ఏర్పాటు పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. చైల్డ్ ఫైత్ మిషన్ నుండి నంగినారపాడు మరియు జడ్పీ హైస్కూల్ వరకు పూర్తయిన రోడ్డు వెడల్పులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నందినారపాడు కల్వర్టు నిర్మాణ పనులు, సత్తివాణి పాలెం రోడ్డు విస్తరణ, నరవ వాటర్ బాడీ సుందరీకరణ, వాకింగ్ ట్రాక్ పనులు మొదలైనవి అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ అధికారులతో చర్చించి పనులు ప్రతిపాదించాలని పర్యవేక్షక ఇంజనీరు గోవిందరావును ఆదేశించారు. గంగవరం రోడ్లులో విద్యుత్ దీపాల పునరుద్ధరన పనులు చేపట్టాలని అలాగే స్థానిక ప్రజలు తాగునీటి సమస్య అధికంగా ఉందని, బోర్లు మరమ్మతులయ్యాయని తెలపగా నీటి సమస్య పై చర్యలు చేపట్టకపోవడంతో సహాయక ఇంజనీరు శ్రీనివాసుపై కమీషనరు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే గంగవరం కాలనీ వాసులకు నీటి సమస్యను పరిష్కరించాలని సహాయక ఇంజనీర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 6వ జోన్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, కార్యనిర్వాక ఇంజనీరు అప్పారావు, ఏసీపీ వెంకట రావు , ఏ ఎమ్ ఓ హెచ్ డాక్టర్ కిరణ్ కుమార్, జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ ఇందల రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు: తహాశీల్దార్

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం బందేపురం గ్రామానికి చెందిన సుమారు కోటి రూపాయలకు పైగా విలువచేసే గ్రామ కంఠం భూమిని కొంతమంది అవకాశవాదులు రాజకీయ నాయకుల అండదండలతో అదే గ్రామంలో సర్వేనెంబర్ 61 లో గల పాత పంచాయతీ భవన స్థలాన్ని దెందేటి పెద్దప్పన్న మరి కొంతమంది జెసిబి సహాయంతో చదును చేసి అమ్మకానికి పెట్టారు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు విశాఖపట్నం జిల్లా కలెక్టర్ వారికి ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మార్వో ఆనందరావు పోలీసువారి సహకారంతో సంఘటన స్థలానికి చేరుకుని దానిని పరిశీలించడం జరిగింది. దెందేటి పెద్దపన్న కుటుంబీకులు మాదని చెప్పగా దీనికి సంబంధించిన పత్రాలను తహశీల్దార్ అడగగా దేందేటి పెద అప్పన్న కుటుంబీకులు మా పెద్దవారు ఇంటి దగ్గర లేరని పొంతన లేని సమాధానాలు చెప్పారు. పాత పంచాయతీ భవనాన్ని సుమారు 30 ఏళ్ల కిందట నిర్మాణం చేయగా ఇదే పంచాయతీ భవనంలో ఐదుగురు సర్పంచులు పాలన కూడా చేసి ఉన్నారు. ఇదే భవనంలో పాల కేంద్రము ,అంగనవాడి కేంద్రము నిర్వహించే వారిని స్థానిక గ్రామస్తులు తాసిల్దార్ కు తెలియజేశారు. వివరాలు తెలుసుకున్న తాసిల్దార్ ఈ స్థలం సరిహద్దులు నిర్ణయించాలని సర్వేయర్ ను ఆదేశించారు. ఈ స్థలం పూర్తిగా పరిశీలన జరిగినంతవరకు పరిసరాల్లో ఉన్నవారు ఎవరూ కూడా ఈ స్థలం వైపు వెళ్లకూడదని తెలియజేశారు. ఈ సంఘటనను జిల్లా కలెక్టర్ వరకు నివేదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీధర్, ఎస్సై సురేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యామల, పంచాయతీ కార్యదర్శి పైడయ్య ,సచివాలయ సిబ్బంది ,వీఆర్వో ,వీఆర్ఏ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా స్థలాన్ని పరిశీలించిన సర్పంచ్, కార్యదర్శి

విశాలాంధ్ర - ఆనందపురం: బంటుపల్లి కల్లాలు కార్యదర్శి చందక వారి కల్లాల వద్ద ట్యాంక్ నీరు వృథాగా పోవడంతో మంగళవారం విశాలాంధ్రలో ప్రచురించిన కథనానికి ఎట్టకేలకు స్పందన లభించింది. స్థానిక సర్పంచ్ కోన శ్రీనివాసరావు పైడిరాజు, కార్యదర్శి షేక్ షమ్ము పారిశుధ్య కార్మికులతో చర్యలు చేపట్టారు. నీరు వృధాగా పోకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నామని, చేతి పంపు బోరు అదే స్థానంలో మూడు నాలుగు రోజుల్లో యధాస్థితిగా పునరుద్ధరిస్తామని తెలిపారు. పంచాయతీ రోడ్లకు రెండు వైపులా ఉన్న పిచ్చి మొక్కలు చెత్తను తొలగించామని తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి షేక్ షమ్ము మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంట దృష్టికి తీసుకు రావాలని సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తామని, ఆఫీసులో అందుబాటులో ఉంటానని వాట్సాప్ ద్వారా గాని, ఆఫీసులో గాని తెలియపరచినట్లయితే చర్యలు తీసుకుంటానని తెలిపారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే ఆదుకోవాలి

విశాలాంధ్ర - బుచ్చియ్యపేట: గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే ఆదుకోవాలని గోవాడ సుగర్స్ రైతుల పరిరక్షణ సమితి అధ్యక్షులు అడపా నరసింహమూర్తి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన వడ్డాదిలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సహకార రంగంలో కొనసాగుతున్న ఏకైక ఫ్యాక్టరీ గోవాడ ఫ్యాక్టరీ మాత్రమే అన్నారు.ఈ ఫ్యాక్టరీ కి పూర్వ వైభవం తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వ పెద్దలపై ఉందన్నారు.ఎంపీ సీఎం రమేష్, అనకాపల్లి,చోడవరం,మాడుగుల ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, కేఎస్ఎన్ఎస్ రాజు,బండారు సత్యనారాయణమూర్తి చొరవ తీసుకోవాలన్నారు.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి ఫ్యాక్టరీని పరిరక్షించాలన్నారు. ప్రభుత్వం నిధులు సమకూర్చని యెడల ఫ్యాక్టరీ ఆస్తులను తాకట్టు పెట్టి అయినా నిధులు సమకూర్చి రైతులను,కార్మికులను ఆదుకో వాలని అన్నారు. ఫ్యాక్టరీలో నిల్వ ఉన్న మొలాసిస్, పంచదార అమ్మకాలు చేపట్టి రైతుల బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. పంచదారను స్టేట్ సివిల్ సప్లై ద్వారా కొనుగోలు చేయాలన్నారు. ప్రైవేటు షుగర్ ఫ్యాక్టరీలు చెరకు కొనుగోలు నియంత్రించాలన్నారు. ఫ్యాక్టరీని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

క్రమశిక్షణ కలిగిన విద్యతో ఉన్నత శిఖరాలు

విశాలాంధ్ర - కోటవురట్ల: విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో ఇష్టపూర్వకంగా చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని ఎస్సై రమేష్ అన్నారు. మంగళవారం కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా సత్ప్రవర్తన పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా తల్లిదండ్రులు గురువులు పెద్దల ఎడల భక్తి భావం కలిగి, గౌరవ మర్యాదలతో మెలగాలన్నారు. విద్యార్థి దశలోనే సత్ప్రవర్తన కలిగి క్రమశిక్షణతో ఇష్టపూర్వకంగా చదివినట్లయితే ప్రతి ఒక్కరు ఉన్నత శిఖరాలకు చేరగలన్నారు. బాల్యం నుండే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళిక బద్ధంగా చదివి కలెక్టర్, ఎస్పీ, డాక్టర్ వంటి ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. యువత మత్తు పదార్థాలకు, వ్యసనాలకు, దురలవాటులకు దూరంగా ఉండాలని హెచ్చరించారు, చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించినట్లయితే జరిగే దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి ఉపాధ్యాయులు ఈశ్వర్ కిషోర్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

20 నుంచి నిర్వహిస్తున్న గ్రేస్ హాపర్ సెలబ్రేషన్ ఇండియా 2024

విశాలాంధ్ర - విశాఖపట్నం: అనిత బి డాట్ ఓఆర్జి ఆధ్వర్యంలో భారతదేశంలో గ్రేస్ హాపర్ సెలబ్రేషన్ ఇండియా (జి హెచ్ సి ఐ) 2024ని నవంబర్ 20వ తేదీ నుంచి 22 వరకు బెంగళూరులో నిర్వహిస్తున్నారు. ఇది భారతదేశంలోని మహిళలు మరియు నాన్-బైనరీ సాంకేతిక నిపుణులకు సాధికారతకు అంకితమైన ప్రధాన కార్యక్రమం. ఇది బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ లో నవంబర్ 20-22 వరకు నిర్వహిస్తుండగా, టెక్ నిపుణుల శక్తివంతమైన సముదాయన్ని ఒకచోట చేర్చేందుకు "నేను ప్లస్ మేము, కలెక్టివ్ పవర్" అనే థీమ్తో ఈ ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు., హిమాచల్ ప్రదేశ్లోని హమీర్పూర్లో నిర్వహించిన గత జిహెచ్సిఐ ఎడిషన్కు భారతదేశంలోని 205 నగరాల నుంచి 6,529 మంది హాజరయ్యారు. .

జీపీడీపీ యాక్షన్ ప్లాన్ కొరకు శిక్షణ

విశాలాంధ్ర - నాతవరం: నాతవరం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) యాక్షన్ ప్లాన్ కొరకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివోఏ సభ్యులు హాజరయ్యారు. ఈఓపీఆర్డీ ఎన్ఎన్వి.మూర్తి పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై వివరించారు. ఈ శిక్షణలో చెప్పిన అంశాలను అందరూ పరిగణలోనికి తీసుకోవాలని సూచించారు.

పోషకాహారంతో మధుమేహం నిర్వహణ సాధ్యం

విశాలాంధ్ర- విశాఖపట్నం: పోషకాహారానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మధుమేహ వ్యాధిని కట్టడి చేయవచ్చు అని ప్రముఖ న్యూట్రిషనిస్ట్ షీలా కృష్ణ స్వామీ, రితిక సమద్ధార్ తెలిపారు. నవంబర్ 14 ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఇక్కడ జరిగిన ఓ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రపంచ మధుమేహ రాజధానిగా పిలువబడే భారతదేశం మధుమేహ సవాలును ఎదుర్కొంటోందన్నారు. బాదం వంటి పోషకమైన ఆహారాలు చేర్చడం ఇందులో కీలకమైనదని, ఇందులో ప్రోటీన్, అసంతృప్త కొవ్వులు మరియు డైటరీ ఫైబర్ వంటి 15 ముఖ్యమైన పోషకాలు ఉంటాయన్నారు.ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి సహాయపడే పోషకాలు. బాదం ఆరోగ్యకరమైన రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి, టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో బ్లడ్ షుగర్ నియంత్రణను మెరుగుపరచడానికి మరియు కార్బోహైడ్రేట్-అధికంగా ఉన్న ఆహారంలో బ్లడ్ షుగర్ ప్రభావాన్ని తగ్గించటానికి తోడ్పడుతుందన్నారు.

ఆంధ్రజ్యోతి రాము మృతి తీరనిలోటు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: శిరిగిరిశెట్టి రాము (ఆంధ్రజ్యోతి జర్నలిస్టు) గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ తన స్వగ్రామమైన బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో తుది శ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు ఘటన స్థలానికి చేరుకుని రాము ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

రెండు రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేస్తాం...

మాజీ ఎంపీటీసీ లోడగల వెంకటరావు

విశాలాంధ్ర - ఆనందపురం: మండల కేంద్రం లోడగలవాని పాలెం పంచాయతీ పరిధిలో శ్రమజీవుల కాలనీలో ఉన్న సిసి రోడ్లను 15 లక్షల వ్యయంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు మొదలు పెట్టామని రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో నాణ్యతతో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లోడగలవానిపాలెం మాజీ ఎంపీటీసీ లోడగల వెంకట్రావు, మాజీ ఉప సర్పంచ్ కంచిబోయిన శ్రీను ఉన్నారు.

శామ్సంగ్ ఫ్యూచర్ టెక్ స్కిల్స్లో 3,500 మంది యువతకు శిక్షణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: శామ్సంగ్ ఇండియా 2024 సంవత్సరానికి శామ్సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ ప్రోగ్రామ్ కింద 3,500 మంది విద్యార్థుల సర్టిఫికేషన్ను పూర్తి చేసింది. భారత ప్రభుత్వం యొక్క స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా కార్యక్రమాలకు అనుగుణంగా, శామ్సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ యువతకు ఏఐ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బిగ్ డేటా కోడింగ్ ప్రోగ్రామింగ్ వంటి అధిక డిమాండ్ ఉన్న సాంకేతిక రంగాలలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారి ఉపాధిని మెరుగుపరచడంపై దృష్టి సారిస్తుంది. శామ్సంగ్ ఫ్లాగ్షిప్ సిఎస్ఆర్ చొరవ 2023లో 3,000 మంది విద్యార్థులను చేర్చుకోవడం నుండి 2024లో 3,500 మంది విద్యార్థులను చేర్చుకోవడం ద్వారా తన పరిధిని విస్తరించింది. ఇది ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ఎన్.సి.ఆర్, తమిళనాడు కర్ణాటకలోని విద్యా సంస్థలలో నిర్వహించబడిన 12 ఎస్ఐసీ సర్టిఫికేషన్ ఈవెంట్లను కలిగి ఉంది. ఎస్ఐసీ కింద కోర్సులు ఆరు విశ్వవిద్యాలయాలు మరియు ఒక జాతీయ నైపుణ్య సంస్థలో పనిచేస్తున్నాయి.